VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 243

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 8 ఫిబ్రవరి 2026


## అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన

- క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం.. ఇది చారిత్రక ఘట్టం: సీఎం చంద్రబాబు
- ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య
- క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా
- హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా, దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన
- ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి





**అమరావతి,కలంకౌంటర్ :** "ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును

- 2లో

## చంద్రబాబు విజన్ అమోఘం... డబుల్ ఇంజిన్ సర్కారుకు ఆయనే నిదర్శనం: జితేంద్ర సింగ్

- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- సీఎం చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి చంద్రబాబే నిలువెత్తు నిదర్శనమని కితాబు
- అమరావతి నుంచే భారత్ క్వాంటమ్ ప్రస్థానం ప్రారంభమవుతుందని ప్రకటన
- రక్షణ, ఆరోగ్యం, కమ్యూనికేషన్ రంగాల్లో క్వాంటమ్ టెక్నాలజీ అత్యంత కీలకం



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక అద్భుతమైన దార్శనికుడని, ప్రధాని నరేంద్ర మోదీ చెప్పే "డబుల్ ఇంజిన్" ప్రభుత్వానికి ఆయనే అసలైన నిదర్శనమని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కొనియాడారు. చంద్రబాబు రేపటిలో జీవిస్తూ, ఎల్లుండి గురించి కలలు కంటారని ప్రశంసించారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం కేవలం ఒక భవన నిర్మాణానికి కాదని, భారతదేశ క్వాంటమ్ భవిష్యత్తుకు పునాది అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. చంద్రబాబు ముందుచూపు, పాలనా వేగాన్ని ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. "హైదరాబాద్‌లో అంతర్జాతీయ వైద్య సదస్సు నిర్వహించడానికి సరైన వేదిక లేనప్పుడు, హైటెక్ సిటీలోని కన్వెన్షన్ హాల్ గురించి తెలిసింది. అప్పుడే చంద్రబాబు దార్శనికత మాకు పరిచయమైంది. ఇప్పుడు ఏపీలో మరోసారి అదే వేగాన్ని చూస్తున్నాం. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ సైన్సెస్ ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం వచ్చాక కేవలం కొన్ని నెలల్లోనే అన్ని అనుమతులు లభించాయి. గత శనివారమే ఆ కేంద్రాన్ని జాతికి అంకితం చేశాం. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తే ఎంత వేగంగా అభివృద్ధి జరుగుతుందో చెప్పడానికి చంద్రబాబే సరైన ఉదాహరణ" అని ఆయన వివరించారు. క్వాంటమ్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరిస్తూ, భవిష్యత్తులో రక్షణ, భద్రత, ఆరోగ్యం, కమ్యూనికేషన్ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తేనుందని జితేంద్ర సింగ్ అన్నారు. "సాధారణ కంప్యూటర్లతో పోలిస్తే క్వాంటమ్ కంప్యూటర్లు అత్యంత వేగవంతమైనవి. క్వాంటమ్ ఎన్‌క్రిప్షన్‌ను ఛేదించడం దాదాపు అసాధ్యం. దీనివల్ల మన దేశ భద్రత మరింత పటిష్టమవుతుంది. ఆరోగ్య రంగంలో, క్యాన్సర్ వంటి వ్యాధులకు రేడియేషన్ చికిత్స అందించేటప్పుడు, క్వాంటమ్ టెక్నాలజీతో కచ్చితంగా కణితి ఉన్న చోటే ప్రభావం చూపి, దుష్ప్రభావాలను నివారించవచ్చు" అని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా వివరించారు. ప్రధాని మోదీ దార్శనికతతో భారత్ నేడు జాతీయ క్వాంటమ్ మిషన్ ప్రారంభించిందని, అమెరికా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన నిలిచిందని మంత్రి గుర్తుచేశారు. ఈ మిషన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 6,000 కోట్లు కేటాయించిందని తెలిపారు. "రాబోయే ఎనిమిదేళ్లలో 1,000 ఫిజికల్ క్యూబిట్‌ల సామర్థ్యం గల క్వాంటమ్ కంప్యూటర్లను అభివృద్ధి చేయడం, 2,000 కిలోమీటర్ల పరిధిలో సురక్షిత క్వాంటమ్ కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేయడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. ఈ ప్రయాణంలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. అమరావతి ప్రాజెక్ట్ కోసం ముఖ్యమంత్రి రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను చూసి తాను

- 2లో

## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు... కదిలిపోయిన పవన్ కల్యాణ్

- బురద రోడ్డుపై విద్యార్థుల ఆవేదన.. సోషల్ మీడియాలో వీడియో
- వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ఉదయగిరిలో రూ.55 కోట్ల రోడ్ల పనులు
- ఈ రోడ్డు మంజూరుతో విద్యార్థులు, రైతుల కష్టాలకు తెర



**అమరావతి,కలంకౌంటర్ :** "పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ విద్యార్థులు చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జలవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జలవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి. ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పటికే 'పల్లెపండగ 1.0, 2.0', సాస్కి నిధులతో కలిపి సుమారు రూ. 55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టుల కింద మొత్తం 641 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటికి అదనంగా, తాజాగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గజ్జలవారిపల్లి రోడ్డును ప్రత్యేకంగా మంజూరు చేయడం గమనార్హం.

## కాలరెగరేసేలా చంద్రన్న పాలన


- జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత
- రప్పా...రప్పా... నరుకుతామని బెదిరించడం కాదు..
- రాష్ట్రాభివృద్ధిపై చర్చకు రండి
- జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్ర సవిత సవాల్
- టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి ప్రాణహాని
- తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని ఒప్పుకోవడమే కారణం
- వచ్చే ఎన్నికల్లో కడపలో క్లీన్ స్వీప్ చేయబోతున్నాం : మంత్రి సవిత
- ఘనంగా టీడీపీ కడప కమిటీ ప్రమాణ స్వీకారం



**కడప,కలంకౌంటర్ :** రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కాలరెగరేసేలా పాలన సాగిస్తోందని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. రప్పా..రప్పా నరుకుతామంటూ బెదరింపు దిగడం కాదని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చకు రావాలని జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో కడపలో అన్ని అసెంబ్లీ స్థానాలను, ఎంపీ స్థానాన్ని కూడా కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుంటుందని, ఆ జిల్లాలో క్లీన్ స్వీప్ చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కడప టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కమిటీ ప్రమాణా స్వీకారం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, టీడీపీ కడప జిల్లా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన భూపేశ్ రెడ్డికి, కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. అన్న ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తరవాతే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం లభించిందన్నారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అన్ని వర్గాల వారికి ప్రాధాన్యమిస్తూ, పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్... టీడీపీని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. పార్టీలో కష్టించిన పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తోందన్నారు. కష్టకాలంలో పసుపు జెండా మోసిన వారిని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ మరిచిపోరన్నారు. పార్టీలోకి యువతకు పెద్ద పీట వేస్తున్నారన్నారు.

**కాలరెగరేసేలా చంద్రన్న పాలన..** ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, సూపర్ సిక్స్ పథకాలను విజయవంతం చేశామని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఫ్రీ బస్, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు ఇలా అన్ని పథకాలను అమలు చేశామన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు కాలరెగరేసేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, రహదారులు, గ్రామీణ రహదారులు ఇలా అన్ని రంగాల్లోనూ

- 2లో

# ఆదాయ వనరుగా 'చెత్త' - జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత








**చెన్నూరు/కమలాపురం,కలంకౌంటర్ :** చెత్తపై జగన్ పన్ను వేసి వేధిస్తే, తమ ప్రభుత్వం చెత్త ద్వారా సంపద సృష్టించి ప్రజలకు ఆదాయం మార్గం చూపించామని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చెన్నూరు మండల కేంద్రంలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి మంత్రి సవిత శనివారం ప్రారంభించారు. అనంతరం చెన్నూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లక్ష్యంతో ఏపీని పరిశుభ్రంగా ఉంచాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దేశంలోనే ఏపీని అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది ఆయన సంకల్పమన్నారు. 2014-19లోనే ఏపీలో ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. తరవాత వచ్చిన జగన్ ఆ కేంద్రాలను మూలన పడేశారన్నారు. చెత్తపై పన్ను వేసిన ఘనత జగన్ దేనన్నారు. చెత్త పన్ను పేరుతో ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు చెత్త నుంచి సంపద సృష్టించేలా చర్యలు తీసుకున్నారన్నారు. మూలనపడిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చారన్నారు. గ్రీన్ అంబాసిడర్ల చేత ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. తడి చెత్తతో సేంద్రీయ ఎరువులు సేకరించి, రైతులకు విక్రయిస్తూ పంచాయతీలకు ఆదాయం మార్గం చూపారు. పొడి చెత్తను సైతం రీ సైక్లింగ్ చేస్తూ ఆదాయ వనరుగా మార్చారు.

**పొడి చెత్తకు నిత్యావసర వస్తువులు..** గ్రామాల్లో ఇంటింటి నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ప్యాకెట్లు, గాజు సీసాలు, పాత పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వంటి పొడి చెత్త సేకరణకు స్వచ్ఛ రథాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని ఇన్చార్జి మంత్రి సవిత వెల్లడించారు. ఈ రథాల ద్వారా పొడి చెత్తను కేజీల రూపంలో తీసుకుని, వాటికి విలువ కట్టి, 20 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. కేజీ ప్లాస్టిక్ విలువను రూ.20లుగా నిర్ణయించామన్నారు. ఇళ్లలో పనికి రాని పొడి చెత్తకు విలువకట్టి నిత్యావసర వస్తువులు అందజేస్తున్నామన్నారు. చెత్తకు కూడా విలువ కట్టి, ఆదాయ వనరుగా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అంతకుముందు స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణా చైతన్యరెడ్డి నడపగా, మంత్రి సవిత పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. సేకరించిన చెత్తకు మంత్రి సవిత నిత్యావసర వస్తువులు అందజేశారు.

# అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం" అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు



నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# చంద్రబాబు విజన్ అమోఘం... డబుల్ ఇంజిన్ సర్కారుకు ఆయనే నిదర్శనం: జితేంద్ర సింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో సంతోషించానని జితేంద్ర సింగ్ అన్నారు. చంద్రబాబు ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ టెక్నాలజీలో బీటెక్, ఎంటెక్ వంటి కోర్సులను కూడా ప్రారంభించవచ్చని సూచించారు. "పవిత్ర అమరావతి నగరం నుంచే నేడు భారతదేశ క్వాంటమ్ ప్రస్థానం ప్రారంభమవుతోంది. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందన్న నమ్మకం నాకుంది" అని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, పలువురు శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారతదేశ క్వాంటమ్ టెక్నాలజీకి పునాది మన క్వాంటమ్ వ్యాలీ

- ఫ్రంటియర్ ఇన్నోవేషన్ సృష్టికర్తగా ఆంధ్రప్రదేశ్ ను నిలబెడతాం
- క్వాంటమ్ వ్యాలీ భారీ స్థాయిలో హై క్వాలిటీ ఉద్యోగాలను సృష్టిస్తుంది
- సీబీఎన్ సారథ్యంలో క్వాంటమ్ విప్లవానికి అమరావతి నాయకత్వం
- మన యువతకు హై-వాల్యూ, ఫ్యూచర్-రెడీ ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యం
- క్వాంటమ్ వ్యాలీ భూమిపూజ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్



**అమరావతి,కలంకౌంటర్ :** ఈ రోజు ఇక్కడ జరుగుతున్నది కేవలం సాధారణ భూమిపూజ కార్యక్రమం కాదు. ఈరోజు అమరావతిలో మనం భారతదేశ క్వాంటమ్ టెక్నాలజీలలో భవిష్యత్ నాయకత్వానికి పునాది వేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతిలో చరిత్రాత్మక క్వాంటమ్ వ్యాలీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా క్వాంటమ్ వ్యాలీలో తమ సంస్థల ఏర్పాటుకు 14 సంస్థలు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... కొన్ని సంవత్సరాల క్రితం ప్రపంచం సాఫ్ట్‌వేర్ సేవల సామర్థ్యాన్ని అర్థం చేసుకుంటుండగానే... భారతదేశంలో దూరదృష్టి గల ఒక సమర్థనేత ధైర్యవంతమైన ప్రశ్న వేశారు. హైదరాబాద్‌ను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్లోబల్ క్యాపిటల్‌గా ఎందుకు మార్చలేం అన్న ఆ ఒక్క ప్రశ్న చరిత్రనే మార్చింది. అది మైక్రోసాఫ్ట్‌తో పాటు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. భారతదేశంలో లక్షలాది ఉద్యోగాలు సృష్టించింది. అది ఒక నగరాన్ని మాత్రమే కాకుండా ప్రపంచ చిత్రపటంలో భారతదేశ ఐటీ విప్లవానికి నాంది పలికింది. ఆ దూరదృష్టి నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు. ఈ రోజు డీప్ టెక్నాలజీస్, మరెన్నో గొప్ప అవకాశాలను సృష్టించే కొత్త యుగంలో, ఆయన మళ్లీ మరో ప్రశ్న వేశారు. క్వాంటమ్ విప్లవాన్ని భారతదేశం ఎందుకు అనుసరించాలి? భారతదేశమే దానిని ఎందుకు ముందుండి నడిపించకూడదు అని. ఆ ప్రశ్నకు సమాధానమే అమరావతి క్వాంటమ్ వ్యాలీ. ముఖ్యమంత్రి గారు మొదటిసారిగా కేబినెట్ సమావేశాల్లో క్వాంటమ్ వ్యాలీ గురించి చర్చించినప్పుడు, చాలా మంది మంత్రులం ఇంటికి వెళ్లి చాట్‌జీపీటీ ద్వారా క్వాంటమ్ అంటే ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాం. ఇతరులు క్వాంటమ్ గురించి చర్చిస్తున్న సమయంలోనే మన ముఖ్యమంత్రి భారతదేశం క్వాంటమ్ టెక్నాలజీని ఎలా ముందుకు నడిపించాలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సమర్థ నాయకత్వం, దూరదృష్టికి ఇది నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ కు మూడు బలాలు ఉన్నాయి. అందులో మొదటిది నిరూపితమైన సమర్థ నాయకత్వం. సీబీఎన్ విజన్, బ్రాండ్, విశ్వసనీయత ఈ రోజు ప్రపంచస్థాయి గుర్తింపు పొందాయి. పెట్టుబడిదారులు హామీలను పొందడమేగాక చరిత్రను చూస్తారు. రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ఇందుకు రెండు స్పష్టమైన ఉదాహరణలు ఇస్తాను. గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని సాధించేందుకు మేము 12 నెలలు లక్ష్యం పెట్టుకుని 13 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించాం. రెండవది అర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ కేవలం ఒక సంవత్సరంలో సాకారం చేశాం. దేశంలోని ఇతర ప్రాంతాల్లో అసాధ్యం అనుకున్నది ఇక్కడ సాధ్యమైంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ లోని డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఆయా సంస్థలకు కావాల్సిన మౌలిక సదుపాయాలపై నిర్దిష్ట హామీ, వేగం, స్పష్టత, జవాబుదారీతనంతో ముందుకు సాగింది. ఏదైనా ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాక అది ఆ కంపెనీకి సంబంధించిన ప్రాజెక్ట్ కాదు. మా సొంత ప్రాజెక్ట్ గా భావించి బాధ్యత తీసుకుంటాం. వారితో కలిసి పనిచేస్తూ అత్యంత ప్రాధాన్యమైనదిగా భావించి ప్రాజెక్టు స్థాపనకు అవసరమైన అన్ని సదుపాయాలు, అనుమతులు కల్పిస్తాం. మూడవది అత్యంత కీలకమైనది. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ రాష్ట్రం. పెట్టుబడుల ఆకలితో ఉన్న మేం ఉత్సాహంగా, వేగవంతంగా ప్రణాళికలు అమలుచేసేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాం. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే మొట్టమొదటిగా అమరావతి క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టి క్వాంటమ్ ఎకోసిస్టమ్ ఏర్పాటుచేస్తున్నాం. హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్, అల్గారిథమ్ లు, ఉత్పత్తులు, ఎగుమతులు, ప్రతిభావంతులకు శిక్షణ అన్నీ ఒకేచోట ఉండేలా దీనికి రూపకల్పన చేశాం. ఈ సంకల్పం ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ వినియోగదారుగా కాకుండా, భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యున్నత సాంకేతిక ఆవిష్కరణ సృష్టికర్తగా నిలబెడుతుంది. అమరావతిని ప్రపంచంలోని ఐదు అత్యున్నత క్వాంటమ్ హబ్‌లలో ఒకటిగా ఉంచడమే మా ధ్యేయం. ఆంధ్రప్రదేశ్‌లో తయారైన క్వాంటమ్ కంప్యూటర్లు, కాంపోనెంట్‌లను ప్రపంచానికి ఎగుమతి చేయాలన్నది మా లక్ష్యం. మన యువతకు ప్రస్తుతం మాత్రమే కాకుండా.. భవిష్యత్ లో కూడా నిలకడైన ఉపాధి, ఆదాయం, ప్రపంచస్థాయి నైపుణ్యాలతో కూడిన వేలాది ఉద్యోగాలు కల్పించడం మా సంకల్పం. భారతదేశ డీప్ టెక్ ప్రయాణానికి స్థిరమైన ప్రోత్సాహం, వ్యూహాత్మక మద్దతు అందిస్తున్న ప్రధాని మోడీ గారికి మా కృతజ్ఞతలు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ గారు, నేషనల్ క్వాంటమ్ మిషన్ కు మా హృదయపూర్వక ధన్యవాదాలు. మేము క్వాంటమ్ మజిలీని ప్రారంభించేటప్పుడు మాకు అన్నివిధాలా సహకారం అందించిన మద్రాసు ఐఐటీ డైరెక్టర్ కామకోటి గారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ చారిత్రక ప్రయాణంలో వారు ఆంధ్రప్రదేశ్‌తో కలిసి నిలబడ్డారు. క్వాంటమ్ వ్యాలీ ఒక కాన్సెప్ట్ కాదు, అది ఇప్పటికే అమలులో ఉంది. అయితే భారతదేశంలోని అత్యాధునిక 133-క్యూబిట్ ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ ఇక్కడ ఆవిష్కృతం కాబోతోంది. భారతదేశంలో మొదటి నేషనల్ క్వాంటమ్ రెఫరెన్స్ ఫెసిలిటీ అమరావతిలో స్థాపితమవుతోంది. సూపర్ కండక్టింగ్, ఫోటానిక్, ఐయాన్ ట్రాప్, న్యూట్రల్ ఆటమ్ టెక్నాలజీలతో బహుళ ప్లాట్‌ఫారమ్‌లు ఇక్కడ కో-డెవలప్ చేయబడుతున్నాయి. 50 వేల మంది లెర్నర్లు ఇప్పటికే శిక్షణ పొందుతున్నారు. 10 లక్షల మంది యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడం మా దీర్ఘకాలిక లక్ష్యం. ఇది టెక్నాలజీ లీప్‌ఫ్రాగ్. మన ఇండస్ట్రీ పార్ట్‌నర్లు IBM, TCS, L&T, SRM యూనివర్సిటీ, QpiAI, QClairvoyance, MoUలు సంతకం చేసిన అన్ని కంపెనీలకు నేను హృదయపూర్వకంగా ధన్యవాదాలు చెబుతున్నాను. మీరు ఇక్కడ ఉన్నారంటే గ్లోబల్ ఇండస్ట్రీ అమరావతిని నమ్ముతోందని రుజువైంది. ముఖ్యంగా క్వాంటమ్ వ్యాలీ భారీ స్థాయిలో హై క్వాలిటీ ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఇది క్వాంటమ్ ఇంజనీర్లు, అడ్వాన్స్‌డ్ AI, కంప్యూటింగ్ స్పెషలిస్టులు, చిప్ డిజైనర్లు, క్రయోజెనిక్స్ ఎక్స్‌పర్టులు, RF ఇంజనీర్లు, స్టార్టప్ ఫౌండర్లు, డీప్ టెక్ రీసెర్చర్లకు అవకాశాలను కల్పిస్తుంది. ఇది ఫ్యూచర్-ప్రూఫ్ ఉద్యోగాలు సృష్టించే మార్గం. ఇదే మన యువత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని కేవలం ఉపయోగించకుండా దాని నిర్మాతలుగా మలిచే మార్గం. అమరావతి కేవలం అడ్మినిస్ట్రేషన్ క్యాపిటల్ సిటీ మాత్రమే కాదు. అమరావతి సైన్స్, కంప్యూటేషన్, ఇన్నోవేషన్ క్యాపిటల్ సిటీగా రూపాంతరం చెందబోతోంది. క్వాంటమ్, డీప్ టెక్, ఏఐ, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ దాని గుర్తింపును నిర్వచిస్తోంది. ఇది గ్లోబల్ టాలెంట్‌ను ఆకర్షించే నగరం. ఇది కేవలం సేవలు మాత్రమే కాకుండా, అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని ప్రపంచానికి ఎగుమతి చేసే నగరం. హైదరాబాద్ భారతదేశం ఐటీ విప్లవానికి నాయకత్వం వహించినట్లుగానే విజనరీ లీడర్ చంద్రబాబు గారి నేతృత్వంలో అమరావతి భారతదేశం క్వాంటమ్ విప్లవాన్ని ముందుండి నడిపించబోతోంది. ఇండస్ట్రీ, అకాడమియా, స్టార్టప్‌ల భాగస్వామ్యంతో తదుపరి సాంకేతిక శకానికి నేతృత్వం వహించడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# కాలరెగరేసేలా చంద్రన్న పాలన

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనులు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత టీడీపీ కార్యకర్తలపై ఉందన్నారు.

**కడపలో క్లీన్ స్వీప్ చేస్తాం...** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని మంత్రి సవిత వెల్లడించారు. కడపలో టీడీపీ పటిష్టంగా ఉందన్నారు. ప్రస్తుతం కడపలో నాలుగున్నర లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. కడపలో గత సాధారణ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాల్లో అయిదు స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. ఇటీవల జరిగిన పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పసుపు జెండా రెపరెపలాడి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి గెలుపు సాధించారన్నారు. ఇదే స్పీడ్ తో వచ్చే సాధారణ ఎన్నికల్లో కడపలో క్లీన్ స్వీప్ చేస్తామని, అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ, పార్లమెంట్ స్థానంలో కూటమి విజయం సాధించడం తథ్యమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు. వైసీపీ నాయకులు ప్రజలను రప్పా...రప్పా...నరుకుతామని బెదిరించడం సరికాదని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ కు, వైసీపీ నాయకులకు సత్తా ఉంటే కూటమి ప్రభుత్వ పాలనపైనా, రాష్ట్ర అభివృద్ధిపైనా చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# మాలకొండ స్వామి వారి ఆదాయం రూ 7,96,793/-లు



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గం లో ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి వారి ఆదాయం రూ 7,96,793/-లు వచ్చాయని ఆలయ ఈవో ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. వేకో జాము నుంచి స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, హోమం, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు పొంగళ్ళు పెట్టుకుని స్వామివారి మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ దగ్గరుండి అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వక కలయిక



**తిరుమల,కలంకౌంటర్ :** తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గా భాధ్యతలు చేపట్టిన ముద్దా రవిచంద్రలిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన ఆంధ్రప్రదేశ్ ఎన్ పి సి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు డైరెక్టర్, తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల కిరణ్, ఉపాధ్యక్షులు కొప్పర్తి శివ, సునీల్ కుమార్ యాదవ్, ఈశ్వర్ నాయక్, కోశాధికారి రేఖ, సభ్యులు రమాదేవి, రవికుమార్ రెడ్డి, తేజేశ్వర్ రెడ్డి, ఉమా శంకర్, యోగేష్, బాలాజీ, మస్తాన్ రావు, శ్రీబాబు, నాగలక్ష్మి తదితరులు

# శిక్షణ



**మోపిదేవి,కలంకౌంటర్ :** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల వారి అద్వర్యం లో మెరకనపల్లి గ్రామంలోని మహిళలకు తక్కువ వినియోగం లో ఉన్న ఆకుకూరలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కె.వి.కె సమన్వయ కర్త డా. డి. సుధారాణి ఆకుకూరల ఉపయోగాలను, రోజువారీ ఆహారంలో ఆకుకూరల యొక్క ప్రాధాన్యతను వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి. కృష్ణవేణి వివిధ రకాల ఆకుకూరలు -- పాలకూర, తోటకూర, మునగాకు, బచ్చలి కూర, మెంతికూర మొదలైన ఆకుకూరల గురించి వివరించి వాటిలో లభించే పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలు మరియు వివిధ విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి చర్చించి మెంతి ఆకు కారం పొడి ని తయారు చేయించారు. ఈ కార్యక్రమం లో సస్య పోషణ శాస్త్రవేత్త డా.యం. వెంకట లక్ష్మి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# హుండీల లెక్కింపు





**శ్రీశైలం,కలంకౌంటర్ :** హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 3,76,22,452/- నగదు రాబడిగా లభించింది. ఈ హుండీల రాబడిని భక్తులు గత 25 రోజులలో సమర్పించారు. ఇందుల ఉభయ దేవాలయాల హుండీల ద్వారా 3,73,32,470/-లు మరియు అన్న ప్రసాదవితరణ హుండీల ద్వారా రూ. 2,89,982లు లభించాయి. 526 -- యుఎస్ఏ డాలర్లు, 84 -- సింగపూర్ డాలర్లు, 140 -- కెనడా డాలర్లు, 10 - ఆస్ట్రేలియా డాలర్లు, 10 -- ఈరోస్, 55 - ఇంగ్లాండు ఫౌండ్స్, 28 - మలేషియా రింగిట్స్, 10 - సౌదీరియాల్స్, 800 - ఓమన్ బైసా, 1435-- యు.ఎ.ఇ దిర్హామ్స్ ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపు నిర్వహించారు. ఈ హుండీల లెక్కింపులో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్.రమణమ్మ, పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో 108 హనుమాన్ చాలీసా



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలో కనిగిరి రోడ్డు నందు శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఉన్న దక్షిణాభిముఖ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిశ్రద్ధలతో 108 హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. సంగీత వాయిద్యాలతో హనుమాన్ చాలీసా పాడుతూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు దుడ్డు హనుమద్ ప్రసాద్, కొత్తపల్లి సురేష్, పెద్దారావు, చెమిడితిపాడు పంచముఖ ఆంజనేయ స్వామి ట్రస్ట్ చైర్మన్ ఆలూరి హనుమంతరావు, భక్తులు పాల్గొన్నారు.

# ఆహ్వానం






**నాగాయలంక,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్ పర్యటన లో భాగంగా నాగాయలంక లో జిల్లా ఆర్యవైశ్య సంఘం వాసవీ భక్తి ప్రచార కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ,మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిట్టా శివ నాగేశ్వరరావు ని ఇతర నాగాయలంక ఆర్యవైశ్య సంఘం సభ్యులను కలిసి రోశయ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఆర్యవైశ్య సంఘం చీఫ్ ఆర్గనైజర్ మానేపల్లి రఘురాం బాబు , జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి ఘంటసాల కన్నయ్య , జిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం చీఫ్ ఆర్గనైజర్ పులవర్తి నటరాజశేఖర్ , జిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యశాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు కారణాలను అన్వేషించి నియంత్రణ చర్యలు చేపట్టాలి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** రహదారి భద్రతలో భాగంగా విజయనగరం జిల్లా డెంకాడ పోలీస్ స్టేషన్ పరిధిలో గల జాతీయ రహదారి 16పై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మరియు పోలీస్ అధికారులు పరిశీలించారు. జాతీయ రహదారి 16పై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్ను స్వయంగా పరిశీలించి, ప్రమాదాలకు కారణాలను అన్వేషించి, ప్రమాదాల నియంత్రణకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద డ్రోన్స్ తో ఇంజనీరింగ్ లోపాలను గుర్తించి, నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న గ్రామాల వద్ద పాదచారులు రహదారి దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని, ఆయా ప్రాంతాల్లో సెంటర్ డివైడర్ పై రైలింగ్ వేయాలన్నారు. ప్రమాదాలు జరిగేందుకు కొన్ని ప్రాంతాల్లో లైటింగ్ సరిగ్గా లేకపోవడంగా గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా, జాతీయ రహదారి, సర్వీసు రోడ్లు కనెక్ట్ అయ్యే ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్ జాగ్ స్టాపర్స్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినపుడు వాహనాల నంబర్లను గుర్తించే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని టోల్ ప్లాజా అధికారులకు తెలియచేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అదే విధంగా రహదారి భద్రతపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్ సిబ్బంది కూడా ద్విచక్ర వాహనం నడిపెటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించే విధంగా చూడాలని అధికారులకు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొనారు.

## పుప్పాల శివరామ కృష్ణ ప్రసాద్ ను గెలిపించండి




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన పుప్పాల శివరామకృష్ణ ప్రసాద్ ను ఈ నెల 13వ తేదీన జరిగే ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎలక్షన్స్ లో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ పై ఎంతో ఉందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. శనివారం మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మచిలీ పట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు, ఆకునూరి నాగేంద్రం అధ్యక్ష తన టిడిపి లీగల్ సెల్ సమావేశం నిర్వహించారు.... ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ....... మన మచిలీపట్నం న్యాయవాదుల సంఘం నుండి మన తెలుగుదేశం పార్టీ కోసం ప్రతినిత్యం కష్టపడి పనిచేస్తున్న పుప్పాల శివరామకృష్ణ ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ బార్ కౌన్సిల్ ఎలక్షన్స్ లో పోటీ చేస్తున్నారు వారి ఎన్నికల సీరియల్ నెంబర్ 105 అయి ఉన్నది. ఆ నెంబర్ పై ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ సభ్యులు, వారి మిత్రులు, కూటమి న్యాయవాద అభిమాన మిత్రులు 105 నెంబర్ పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మన మచిలీపట్నం అభ్యర్థి అయిన పుప్పాల శివరామకృష్ణ ప్రసాద్ ను గెలిపించాలని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ సభ్యులందరినీ గొర్రెపాటి గోపీచంద్ కోరారు. స్టేట్ బార్ కౌన్సిల్ ఎలక్షన్స్ ఈనెల 13వ తేదీన జరుగుతున్న సందర్భంగా మనకు తెలిసిన న్యాయవాదుల కుటుంబాల అందరిని మన తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా కలుసుకుని, మన మచిలీపట్నం అభ్యర్థి అయిన పుప్పాల శివరామకృష్ణ ప్రసాద్ విజయం కోసం కృషి చేయవలసిన బాధ్యత మనందరిపై ఉంది అన్నారు. పుప్పాల శివరామకృష్ణ ప్రసాద్ తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతి కార్యకర్తకు లీగల్ గా ఎంతో ఉపయోగపడ్డాడని, అలాంటి వ్యక్తిని మనం గెలిపించుకుని, మన మచిలీపట్నంనకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు మన మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ తేవాల్సిన బాధ్యత మనపై ఉంది అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ కు మేమందరం అండగా ఉంటాము అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్, రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, పామర్తి నరసింహమూర్తి, సీనియర్ న్యాయవాదు లు, పరస మధుసూదన రావు, పుప్పాల వెంకటరావు, బృందావనం శ్యామ్ కుమార్, కె. ఎన్. నాగ ఆంజనేయులు, చలపాటి రాజేష్, సుజ్ఞానం శైలేష్, లంకి శెట్టి నీరజ, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే: షర్మిల

**విజయవాడ, కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. స్వప్రయోజనాల కోసం సీమ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇద్దరూ నాటకాలు ఆడారని ఆమె ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ఇరువురు నేతల వైఖరిని ఆమె తప్పుబట్టారు. వైసీపీ ప్రభుత్వంపై షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్ల పాలనలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అంశంలో నిద్రపోయి-ఎన వైసీపీ, ఇప్పుడు ఓటమి తర్వాత ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు" అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్జీటీ వద్ద బలమైన వాదనలు వినిపించకుండా, కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాకుండా ఇప్పుడు ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు. "ఐదేళ్లు ప్రధాని మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్‌కు అప్పుడు సీమకు నీళ్లివ్వాలని గుర్తుకురాలేదా?" అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, సీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆమె విమర్శించారు. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు సంగమేశ్వరం వద్ద కాకుండా ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పడాన్ని కూడా షర్మిల తప్పుబట్టారు. "ఎవరిని మోసం చేయడానికి ఇద్దరూ కలిసి ఈ నాటకాలు ఆడుతున్నారు? మోదీ దగ్గర సాగిలపడి సీమకు అన్యాయం చేస్తారా?" అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. ఇద్దరు నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని, సీమ ప్రయోజనాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

## ముగిసిన చతుర్దశ కల్యాణోత్సవాలు




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి దేవస్థానం, (శివాలయము) లో గత మూడు రోజులుగా జరుగుతున్న చతుర్దశ కళ్యాణం మహోత్సవాలు శనివారం సాయంత్రం స్వామి వారల ఊరేగింపు కార్యక్రమాలతో వైభవంగా ముగిశాయి. ఐదో తేదీ నుండి జరుగుతున్న ఈ మహోత్సవాల్లో చివరి రోజు అయిన శనివారం ఉదయం శ్రీ స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశముగా రుద్రాభిషేకము, అనంతరం రుద్రహోమం, లక్ష్మీ గణపతి హోమం, ఆయుష్య హోమం నిర్వహింపబదినది. గ్రామంలోని భక్తులు విశేషంగా ఈ హోమాలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం శివ పార్వతులు మరియు భద్రకాళీ వీరభద్ర స్వామి వార్ల ఊరేగింపు నిర్వహింబడినది. ఆలయ ధర్మకర్త జోస్యుల విజయ్ కుమార్ సారథ్యంలో జరిగిన ఈ చతుర్దశ మహోత్సవాలను భక్తులకు ఎలాంటి అసౌకర్యం ను కలగకుండా తగిన చర్యలు తీసుకొని ఉత్సవాలను విజయకుమార్ విజయవంతంగా నిర్వహించారు. పలువురు విజయ్ కుమార్ ని అభినందించారు.

## అంతర్జాతీయ మెడల్స్ సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన పోలీసులు - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్ లో బంగారు పతకాలు సాధించిన విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషన్లో పని చేస్తున్న ఎఎస్ఐ ఆల్తి త్రినాధరావు, ఆర్మ్డ్ రిజర్వులో హెచ్.సి.గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మజ్జి శంకరరావులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పోలీసు కార్యాలయంలో అభినందించి, ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ పతకాలు సాధించిన ఇరువురు జిల్లా ఎస్పీ నీ పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవగా, వారి క్రీడా ప్రతిభను జిల్లా ఎస్పీ ప్రశంసించి, శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - నేపాల్లోని పొకరాలో ఫిబ్రవరి 2026లో అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా శ్రీలంక, భూటాన్, మలేషియా, ఇండియా, నేపాల్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీల్లో 60ం విభాగంలో వన్ టౌన్ ఎఎస్ఐ ఆల్తి త్రినాధరావు పాల్గొనగా, 70ం విభాగంలో రిటైర్డ్ ఎఆర్ హెచ్.సి. మజ్జి శంకరరావులు పాల్గొన్నారన్నారు. అంతర్జాతీయ పోటీల్లో నేపాల్, భూటాన్, మలేషియా, శ్రీలంక, ఇండియా దేశాలకు చెందిన క్రీడాకారులతో పోటీపడి, పోటీల్లో పాల్గొన్న అన్ని విభాగాల్లో బంగారు పతకాలు సాధించి, యువతకు, ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో నిరంతం సాధన చేసి, శారీరక ధృడత్వంతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రీడల్లో రాణిస్తూ బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన ఆల్తి త్రినాధరావు, మజ్జి శంకరరావులు జిల్లా పోలీసుశాఖకు చెందినవారు కావడం గర్వంగా ఉందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. అనంతరం, ఆల్తి త్రినాధరావు, మజ్జి శంకరరావులతో జిల్లా ఎస్పీ మాట్లాడి, పోటీలు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వన్ టౌన్ ఎఎస్ఐ ఆల్తి త్రినాధరావు 100మీ॥లు, 200మీ॥లు, ట్రిపుల్ జంప్ , పవర్ లిఫ్టింగు పోటీల్లో పాల్గొని, నాలుగింటిలోను బంగారు పతకాలు సాధించగా, రిటైర్డ్ ఎఆర్ హెచ్.సి. మజ్జి శంకరరావు 100మీ॥లు, 200మీ॥లు, 5కి॥మీ॥ వాక్ మరియు పవర్ లిఫ్టింగులో నాలుగు బంగారు పతకాలు సాధించారన్నారు. అంతర్జాతీయ పతకాలు సాధించిన ఎఎస్ఐ అల్తి త్రినాధరావును, రిటైర్డ్ ఎఆర్ హెచ్.సి. మజ్జి శంకరరావుల క్రీడా ప్రతిభను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపి, ఇరువురిని సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి, జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభిలషించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు కే.శ్రీనివాసరావు పాల్గొని, అంతర్జాతీయ మెడల్స్ సాధించిన త్రినాధరావు, శంకరరావులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రూప్ 2 పరీక్షల్లో ఉద్యోగాలు సాధించిన సురేష్, జయసూర్య లకు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఘన సన్మానం




**కందుకూరు,కలంకౌంటర్ :** విద్య జీవితాన్ని మార్చింది అనడానికి పరుసు సురేష్, దమ్ము జయ-సూర్య లే నిదర్శనమని శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ వారు అన్నారు. ఈమధ్య విడుదలైన గ్రూప్ 2 కందుకూరు నియోజకవర్గానికి చెందిన పరసు సురేష్ సబ్ రిజిస్ట్రార్ గా,దమ్ము జయ సూర్య ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా ఎంపికయ్యారు. వీరిరువురిని శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డా" చక్కా వెంకట కేశవరావు, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ విద్య ఒక్కటే జీవితాన్ని మార్చేస్తుందని అన్నారు. వారికే కాకుండా వారి కుటుంబానికి కూడా సమాజంలో గౌరవం తీసుకుని వస్తుందని అన్నారు. తమ ఉద్యోగాల ద్వారా సమాజానికి మరిన్ని సేవలు అందించాలని వారిని కోరారు. సురేష్, జయ సూర్య మాట్లాడుతూ తాము పేదరికరంలో ఉన్న కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించామని, ప్రతి ఒక్క విద్యార్థి కూడా కష్టపడి చదివి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ.సి.మెంబర్లు ఇన్నమూరి శ్రీనివాసులు,కోట వెంకటేశ్వర్లు( కెసిఆర్ ), తాతా వెంకట నాగకార్తీక్, సభ్యులు గుర్రం చిన్నఅల్లూరయ్య(జి సి ఏ), కోలా శ్రీనివాసమూర్తి (ఎంపీడీవో ఆఫీస్), వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# శుభాకాంక్షలు తెలిపి సన్మానం



మచిలీపట్నం,కలంకౌంటర్ : తెలుగుదేశం పార్టీ జిల్లా నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేసిన నిమ్మకూరు లో సభా వేదిక మీద శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేసిన ఐ టి ఐ కాలేజ్ అధినేత కొత్తగుండు రమేష్,చలపతిరావు.



# స్వామివారిని దర్శించుకున్న ఇల్లూరి లక్ష్మయ్య



**విజయవాడ,కలంకౌంటర్ :** వాసవి సత్ర సముదాయములు ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య శ్రీ వీరబాబు స్వామివారి దేవస్థానానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం ఐ వి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంట్ల రామ్మోహనరావు సన్మానించారు.



**పరిశీలన...** విజయవాడ లో నిర్మాణం జరుగుతున్న మహాసభ భవన నిర్మాణ పనులు పరిశీలించిన ఇల్లూరి లక్ష్మయ్య.

# కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ భవనాలను ఉపయోగించండి - లంకిశెట్టి బాలాజీ డిమాండ్...



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నంలో కేవలం అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వానికి చెందిన కోట్లాది రూపాయల ఖరీదు చేసే భవనాలు మూతబడి ఉన్నాయి అని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. శనివారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ మచిలీపట్నం మెయిన్ రోడ్డు 17వ డివిజన్ లోని కోట్ల రూపాయలు ఖరీదు చేసే "టౌన్ హాల్" మూతపడి పది సంవత్సరాలు గడుస్తున్నా దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. గతంలో కొన్ని వేల కార్యక్రమాలు నిర్వహించిన టౌన్ హాలు నేడు మూత పడటం సాంస్కృతిక సాహిత్య సంస్థలకు తీరనిలోటని బాలాజీ అన్నారు. నగరం నడిబడ్డలో సువిశా లమైన కార్ పార్కింగ్ తో ఉన్న టౌన్ హాల్ బిల్డింగును మూసివేయడం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. కేవలం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పూర్తి నిర్లక్ష్యం వల్ల పవన్ మూసివేశారని బాలాజీ అన్నారు. అదేవిధంగా గత 15 సంవత్సరాలుగా నిర్లక్ష్యం కాబడిన మచిలీపట్నం టి.టి.డి కళ్యాణ మండపం కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రిపేర్లు చేసి ఆధునికరించాలని బాలాజీ డిమాండ్ చేశారు. టీటీడీ కళ్యాణ మండపం మూసి వేయడం వలన హిందూ బత్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని బాలాజీ అన్నారు కోట్ల రూపాయలు ఆదాయం ఉన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపాలు పనిచేయకపోవడం అధికారులకు కనిపించడం లేదా అని బాలాజీ ప్రశ్నించారు. మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్ సాయిబాబా గుడి వెనక ఉన్న అంబేద్కర్ భవన్ కు తక్షణమే నిధులు విడుదల చేసి అంబేద్కర్ భవనం ఆధునిక వసతులు తో నిర్మించాలని బాలాజీ డిమాండ్ చేశారు. నగర ప్రజలకు అందుబాటులో ఉండే టౌన్ హాలు, టిటిడి కళ్యాణ మండపం, అంబేద్కర్ భవన్ నేడు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రవేటు కళ్యాణ మండపాలు లక్షల రూపాయలలో అద్దెలు వసూలు చేసి దోపిడీకి గురి చేస్తున్నాయని బాలాజీ అన్నారు. జిల్లా ముఖ్య కేంద్రంలో విలువైన మూడు భవనాలను వెంటనే వినియోగం తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాలాజీని కోరారు.

# క్యాన్సర్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి కొమ్మా రెడ్డి హైస్కూల్లో 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థిని విద్యార్థులకు శనివారం క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంను బంటుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ హెల్త్ ఆఫీసర్, సి.హెచ్. శ్రీనివాసరావు నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం 14 సంవత్సరాలు గల విద్యార్థినిలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా రక్షించే హెచ్.పి.వి. వ్యాక్సిన్ ను ఉచితంగా అందజేస్తున్నదని, క్యాన్సర్ పై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం బి సాక్షామని, ఆశ వర్కర్ సిహెచ్ ప్రసన్న ,స్కూల్ హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు , ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేర్చండి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఎన్నికల సమయంలో విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని పలువురు వక్తలు కోరారు. స్థానిక ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో శనివారం కృష్ణాజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రివర్గ ఉప సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. జేఏసీ అమరావతి కో కన్వీనర్ గా ఎన్నికైన ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిఎస్ఎస్ఎన్ పి శాస్త్రికు అభినందనలు తెలిపారు. 12వ పిఆర్సి కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని తదితర హామీలను నెరవేర్చాలని వారు కోరారు. ఈ సందర్భంగా సంఘానికి విశేష సేవలు అందించిన జిల్లా కోశాధికారి ఏ శంకరరావు, కార్యదర్శులు బికే దుర్గారావు, యం సత్య నారాయణలను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా సంఘం అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఆశీర్వాదం, అసోసియేట్ అధ్యక్షుడు కే ఆదినారాయణ, ఉపాధ్యక్షులు వివి కృష్ణారావు, ఎస్ రాఘవరావు, కే ఫణిభూషణరావు, యడ్ల దుర్గారావు, మండల యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.






Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com